సాక్షి మెదక్

శుక్రవారం | 27 | జూన్ | 2025



ప్రణాళిక.. ప్రహసనం

పురపాలికల్లో వందరోజుల యాక్షన్‌ప్లాన్ సరిగా అమలవ్వడం లేదు.

వివరాలు 8లో ▸



చేయూత.. ఉపాధి

మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెడుతున్నాయి. వివరాలు 8లో ▸



కదలని కార్గో సేవలు

ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

క్షేత్రస్థాయిలో భూ భారతి దరఖాస్తుల పరిశీలన

మెదక్ ఆర్డీఓ రమాదేవి



భూ భారతీపై సమీక్షిస్తున్న ఆర్డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్): భూ భారతి దరఖాస్తుల పరిష్కారం కోసం అవసరమైతే క్షేత్రస్థాయిలో సర్వేయర్‌తో కలిసి పరిశీలించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి ఆదేశించారు. గురువారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులతో భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు అందించిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మన్నన్, ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా వంద రోజుల ప్రణాళిక

మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి



శ్రీరాంచరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న మేనేజర్ ఇతర సిబ్బంది

నర్సాపూర్: మున్సిపల్ కమిషనర్‌గా శ్రీరాంచరణ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తానని చెప్పారు. పట్టణ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలు అర్హులందరికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కాగా, కమిషనర్‌ను మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, ఇతర సిబ్బంది శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కూలీలకు పని కల్పించడమే లక్ష్యం

డీఆర్డీఏ ఏపీడీ రంగాచారి



కొల్చారం(నర్సాపూర్): కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించడమే లక్ష్యంగా గ్రామ క్షేత్ర సహాయకులు పనిచేయాలని, పనుల్లో పారదర్శకత తప్పనిసరని డీఆర్డీఏ ఏపీడీ రంగాచారి అన్నారు. బుధవారం ఎంపీడీఓ రఫీక్ ఉన్నీసా అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్, అటవీశాఖల ద్వారా రూ.4 కోట్ల 65 లక్షల పనులు జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. పనులు జరిగే సమయంలో క్షేత్ర సహాయకులు మాస్టర్స్‌లో దిద్దుబాటు చర్యలు చేపట్టామని, ఇందుకుగాను రూ.3వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఓ కష్ణవేణి, ఏపీఓ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్



మాట్లాడుతున్న మల్లేశం గౌడ్

కొల్చారం(నర్సాపూర్): పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎనగండ్ల గ్రామంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి శివప్రసాద్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరీష్, ఉపాధ్యక్షుడు వెంకటయాదవ్, కార్యదర్శి నాగరాజు, మాజీ ఉపాధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

హవేళీఘణాపూర్(మెదక్): గతంలో డీసెట్ అర్హత సాధించి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని వారి కోసం శుక్రవారం ధ్రువపత్రాలను పరిశీలించేందుకు అవకాశం కల్పించినట్లు డైట్ ప్రిన్సిపాల్, డీఈవో రాధాకిషన్ తెలిపారు. అభ్యర్థులు ఒర్జినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు చేరుకొని ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎంపిక కోసం 28 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని, జూలై 1న ఆప్షన్లకు సంబంధించి ఎడిట్ ఆప్షన్ ఉంటుందని, ఫేజ్–1లో సీటు పొంది వివిధ కళాశాలలో ప్రవేశం పొందిన వారు స్లైడింగ్ ఆప్షన్ వినియోగించుకోవచ్చని సూచించారు.

భూ సమస్యలకు మోక్షం!

- ఆగస్టు 15లోపు పరిష్కరించేందుకు సన్నాహాలు
- కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ
- జిల్లావ్యాప్తంగా 37 వేలకు పైగా అర్జీలు



మెదక్‌జోన్: ఏళ్ల తరబడి భూ సమస్యలతో సతమతం అవుతున్న అన్నదాతలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆగస్టు 15లోపు గ్రామ సభల్లో స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరిస్తామని పేర్కొంది. ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తం అవుతుంది.

జిల్లావ్యాప్తంగా 21 మండలాలు ఉండగా, 4 లక్షల పైచిలుకు వ్యవసాయ సాగు భూములు ఉన్నాయి. కాగా భూ సమస్యల పరిష్కారం కోసం తెచ్చిన నూతన భూ భారతి చట్టంలో భాగంగా ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులోభాగంగా జిల్లాలో 37,817 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్ల దరఖాస్తులు 8,386 రాగా, అసైన్మెంట్ భూములకు సంబంధించి 7,001, సాదాబైనామాల దరఖాస్తులు 6,500 వచ్చాయి. మిగతా 15,930 దరఖాస్తులు ఇతర సమస్యలపై వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిని ఆగస్టు 15వ తేదీ వరకు పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావటంతో జిల్లా అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

కొనసాగుతున్న సర్వేయర్ల శిక్షణ

జిల్లావ్యాప్తంగా 219 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో మొదటి విడతగా 116 మంది సర్వేయర్లకు మే 26 నుంచి శిక్షణ ప్రారంభించారు. ఇది జూలై 26 వరకు కొనసాగనుంది. అనంతరం వీరికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారిని మాత్రమే విధుల్లోకి తీసుకోనున్నట్లు తెలిసింది. ఇక 2వ విడతలో 113 సర్వేయర్లకు ఎప్పటి నుంచి శిక్షణ ఇస్తారనేది ఇంకా షెడ్యూలు రాలేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అలాగే గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమిస్తామని ప్రభుత్వం పేర్కొంది. గతంలో పనిచేసిన వీఆర్‌ఓలు, వీఆర్ఏలు దరఖాస్తు చేసుకుంటే గ్రామ రెవెన్యూ అధికారులుగా నియమిస్తామని ప్రకటించటంతో జిల్లా వ్యాప్తంగా 104 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీరికి గత నెలలో పరీక్ష నిర్వహించగా కేవలం 47 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. కానీ, వీరికి ఇప్పటి వరకు ప్రభుత్వం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు.

ఇది నిరంతర ప్రక్రియ



భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులకు త్వరలో పరిష్కారం చూపుతాం.

–నగేష్, అదనపు కలెక్టర్

ఎకో మిత్రం.. ఆహ్వానం

- పర్యావరణంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు
- జూలై 1 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- ప్రతిభ గల వారికి ఈ–సర్టిఫికెట్



నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని అభివృద్ధి పర్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం జాతీయ విద్యార్థుల పర్యావరణ (ఎస్ఎన్‌పీసీ) క్విజ్ పోటీని 'హరిత్–ది వే ఆఫ్ లైఫ్'అనే నినాదంతో కేంద్ర విద్యాశాఖ, పర్యావరణ శాఖలు నిర్వహించనున్నాయి. సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, తగ్గిపోతున్న వన సంపదను పెంచడంతో పాటు విద్యార్థులు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఈనెల 24న కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆవిష్కరించారు.

జూలై 1 నుంచి రిజిస్ట్రేషన్

ఈ క్విజ్ పోటీలో పాల్గొనేందుకు విద్యార్థులు, యువకులు జూలై 1 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఆన్‌లైన్ 'ఈకో మిత్రమ్' యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆన్‌లైన్ నమోదుకు ఎలాంటి ఫీజు ఉండదు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న, వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ పోటీకి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహాయ సహకారం ఉంది. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటిస్తారు.

ఒకటో తరగతి నుంచి పీజీ వరకు..

విద్యార్థుల్లో పర్యావరణంపై చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ఈ పోటీలు కొనసాగనున్నాయి. జిల్లాకు చెందిన 1వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఇతర సామాన్య పౌరులు కూడా పాల్గొనవచ్చు. వీరిని గ్రూపుల వారీగా విభజిస్తారు. పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఈ–సర్టిఫికెట్ లభిస్తుంది. విద్యా సంస్థలకూ ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుంది. హిందీ, ఇంగ్లీష్, మరిన్ని భాషలలో క్విజ్ పోటీ ఉంటుంది.

ఐదు విభాగాలలో పోటీ



ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తాం. పోటీలో విద్యార్థులు మొక్కలు నాటడం, చెత్త వేరు చేయడం, నీటి సంరక్షణ వంటి అంశాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాజిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

17 మంది కేజీబీవీ అధికారులకు షోకాజ్

- సమాచారం లేకుండా మెటీరియల్ కొనుగోలు
- ఆగ్రహించిన డీఈవో.. విచారణకు ఆదేశం

మెదక్‌జోన్: కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)కి చెందిన 17 మంది అధికారులకు జిల్లా విద్యాధికారి షోకాజ్ నోటీసులు అందజేశారు. దీంతో కేజీబీవీల్లో కలకలం రేగింది. జిల్లా వ్యాప్తంగా 19 కేజీబీవీలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో కేజీబీవీల్లో ఉన్న డైట్ చార్జీలతో పాటు ఇతర అవసరాల కోసం ఉపయోగించాల్సిన రూ.17 లక్షల నిధులతో 17 కేజీబీవీల ప్రత్యేక అధికారులు టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) కొనుగోలు చేశారు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవి కావటంతో వాటిని భోజనం ఖర్చులతో పాటు ఇతర అవసరాలకు వినియోగించాల్సి ఉండగా.. అవగాహన రాహిత్యంతో టీఎల్ఎం మెటీరియల్ కొనుగోలు చేశారు. కాగా టీఎల్ఎం కోసం ప్రతియేటా కేంద్రం నుంచి నిధులు విడుదల కానున్నాయి. ఖాతాల్లో ఉన్న నిధులను సకాలంలో వినియోగించకుంటే వెనక్కు పోతాయనే ఉద్దేశంతో ఉన్నతాధికారులకు సైతం సమాచారం లేకుండా టీఎల్ఎం మెటీరియల్‌ను కొనుగోలు చేశారు. ఇది నిబంధలనకు విరుద్ధమని డీఈవో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

అవగాహన రాహిత్యం వల్లే..

కేజీబీవీ అధికారులు అవగాహనరాహిత్యంతోనే బోధన అభ్యాసన సామగ్రి (టీఎల్ఎం) మెటీరియల్‌ను కొనుగోలు చేశారని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఈ విషయమై కేజీబీవీ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) పూర్తి నివేదిక అడిగారన్నారు. విచారణ జరిపి త్వరలో నివేదిక అందజేస్తామని రాధాకిషన్ తెలిపారు.

84 శాతం రేషన్ బియ్యం పంపిణీ

జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్

మెదక్ కలెక్టరేట్: రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న మూడు నెలల కోటా సన్నబియ్యం ఈ నెలాఖరుతో ముగియనుందని, అనంతరం పంపిణీ ప్రక్రియ కొనసాగింపు ఉండదని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువు నెలాఖరు వరకే ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 84.33 శాతం బియ్యం పంపిణీ పూర్తి అయినట్లు తెలిపారు. జిల్లాలో 520 రేషన్ షాప్‌లో బియ్యం పంపిణీ కొనసాగుతోందని చెప్పారు. ప్రతి రేషన్ కార్డు దారుడు సంబంధిత రేషన్ దుకాణంలో తప్పనిసరిగా తమ బయోమెట్రిక్ వేసి సన్న బియ్యం తీసుకోవాలని కోరారు.

వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

నర్సాపూర్‌లో తాజాగా ఓ సిమెంట్ దుకాణంలో చోరీ



నర్సాపూర్‌లోని స్టీల్ అండ్ సిమెంట్ దుకాణంలో చోరీకి పాల్పడుతున్న దొంగ

నర్సాపూర్: నర్సాపూర్‌లో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలు పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలో వరుసగా ఐదోరోజు కూడా మూడు చోట్ల చోరీలు జరిగాయి. పట్టణంలోని చౌరస్తా సమీపంలోని యాదాగౌడ్‌కు చెందిన శ్రీనివాస స్టీల్ అండ్ సిమెంటు దుకాణంలో బుధవారం రాత్రి దొంగలు చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.6 వేలు ఎత్తుకెళ్లారు. ఇక మెయిన్‌రోడ్డుపై ఉన్న హైదర్‌బేగ్ కాంప్లెక్స్‌లోని లైఫ్ కేర్ మెడికల్ హాల్ తాళం ధ్వంసం చేసి లోపలికి వెళ్లి దుకాణంలో ఉన్న రూ.4 వేలు పట్టుకుపోయారు. అదే కాంప్లెక్స్‌లో ఉన్న ఓ క్లినిక్ లోపలికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.3,900లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఆయా దుకాణాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి చోరీలు జరిగిన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా పట్టణంలో వరుసగా చోరీలు జరుగుతుండటంతో రాత్రివేళల్లో పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని, చోరీ ముఠాలను వెంటనే పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పట్టుకుంటాం: సీఐ జాన్‌రెడ్డి

చోరీలకు పాల్పడుతున్న దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. తమ సిబ్బంది రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినా తమకు సమాచారం ఇవ్వాలి. చోరీ ఘటనల్లో ఆధారాలు సేకరించాం. పాత రికార్డులతో సరి చూస్తున్నాం, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఆయన వివరించారు.



ర్యాలీలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ, ఇతర అధికారులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- తల్లిదండ్రులు పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత ఉద్యమించాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి యువత రేపటి భావిభారత పౌరులని, డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల విచక్షణ కోల్పోయి అనేక నేరాలు చేస్తున్నారని, ఇలాంటి కేసులు పెద్ద మొత్తంలో నమోదు అవుతున్నాయని తెలిపారు. అంతకు ముందు రాందాస్ చౌరస్తాలో డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమా, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం కౌడిపల్లి మండలం దేవులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల తో పాటు పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం సీహెచ్‌సీని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో జిల్లాలో 9 వేల ఇళ్లు మంజూరు చేయగా, 3,500 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అలాగే వర్షాకాలం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులలో ఆలోచనశక్తిని పెంపొందించి కొత్త ఆవిష్కరణల కోసం ఇన్‌స్పైర్ చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఈఓ రాధాకిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తితో కలిసి ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు సెప్టెంబర్ 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థికి రూ.10 వేలు నజరానా ఇస్తామన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ వసంతసేన



మాట్లాడుతున్న వసంతసేన

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ వసంతసేన తెలిపారు. గురువారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన పదాధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇందిర మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. సంఘంలోని మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి నెల సంఘం సమావేశం నిర్వహించుకుని రుణాల చెల్లింపుపై సమీక్షించాలని చెప్పారు. నెలసరి లెక్కలు, రిజిస్టర్లు, సంఘం లావాదేవిలు సక్రమంగా నిర్వహించుకోవాలని తెలిపారు. మహిళల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం సీఆర్‌పీలు శోభారాణి, అనురాధ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పుణ్యమ్మ, కార్యదర్శి లత, కోశాధికారి రాధిక, సీసీలు దుర్గయ్య, శ్రీకాంత్, రమేష్, లక్ష్మి, పురుషోత్తం, నర్సింలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు 14 మంది ఎంపిక



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు 14 మంది ఎంపికైనట్లు యువజన క్రీడలశాఖ జిల్లా అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వారికి అవుట్‌డోర్ స్టేడియంలో గురువారం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా నుంచి 8 మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారని చెప్పారు. విద్యార్థులకు 1, 2వ తేదీలలో ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్ లో రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు.

కేజీబీవీలకు మంచి రోజులు!

జిల్లాలోని 15 స్కూళ్లలో మరమ్మతులు

- మొదటి విడతగా రూ.1.65 కోట్లు మంజూరు
- అన్నీ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం



రామాయంపేట కేజీబీవీ పాఠశాల

జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలకు మంచి రోజులొచ్చాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ. 1.65 కోట్లు మంజూరు చేసింది. దీంతో విద్యార్థినులకు మౌలిక వసతులు సమకూరనున్నాయి.

–రామాయంపేట(మెదక్)

జిల్లాలో 15 కస్తూర్బా పాఠశాలలుండగా, వీటిలో తొమ్మిది పాఠశాలల్లో ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఈస్కూళ్లలో గత ఐదారేళ్లుగా సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కాలేదు. తాజాగా ఈ స్కూళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గాను ప్రభుత్వం మొదటి విడతగా రూ. కోటి 65 లక్షలు మంజూరు చేసింది.

చేపట్టనున్న పనులు ఇవే..

జిల్లాలోని 15 స్కూళ్లలో చిన్నా, పెద్ద మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వీటితో విద్యుత్ పరంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించనున్నారు. పలు స్కూళ్లలో విద్యార్థులకు వేడినీరు అందించే సోలార్ యంత్రాలు చెడిపోగా, ఈ నిధులతో వాటికి మరమ్మతులు చేయించనున్నారు. అలాగే నీటి సరఫరా పైపులైన్లతో పాటు పాక్షికంగా శిథిలమైన వాటర్ ట్యాంకులు రిపేర్ చేయనున్నారు. వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులకు ఈ నిధులు కేటాయించనున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణతో పాటు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించనున్నారు. అలాగే ఇతర అత్యవసర పనులకు, మైనర్ రిపేర్లకు, డ్రైనేజీ, ప్రహరీ నిర్మాణాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. 7 పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభించడంతో గతంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు అదనంగా మరికొన్ని నిర్మించనున్నారు.

కేజీబీవీ మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)	
రేగోడ్	21.690
అల్లాదుర్గం	3.856
చేగుంట	3.856
చిప్పల్‌తుర్తి	7.712
చిట్కుల్	23.136
కొల్చారం	2.410
మెదక్	26.992
పాపన్నపేట	3.856
రామాయంపేట	2.410
పెద్దశంకరంపేట	28.438
చిన్నశంకరంపేట	3.856
శివ్వంపేట	26.992
టేక్మాల్	3.856
తూప్రాన్	3.856
వెల్దుర్తి	2.410

విద్యార్థినుల బాధలు తీరినట్లే..



జిల్లావ్యాప్తంగా అన్ని కేజీబీవీ ల్లో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వీటితో దాదాపుగా అన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇక విద్యార్థినుల బాధలు తీరినట్లే. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

గాయపడ్డ నెమలికి చికిత్స


నెమలిని అటవీ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

శివ్వంపేట(నర్సాపూర్‌): గాయపడిన నెమలికి అటవీ సిబ్బంది చికిత్స చేయించారు. గురువారం మండల పరిధిలోని గోమారం గ్రామ శివారులో వెంకట్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీ పామ్ వద్ద ఓ నెమలి గాయపడి ఉండగా గుర్తించిన రైతు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శివ్వంపేట ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్, బీట్ అధికారి శ్రీవల్లి గాయపడిన నెమలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నెమలికి నర్సాపూర్‌లో పశు వైద్యశాలలో చికిత్స చేయించి అడవిలో వదిలిపెట్టారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్‌: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాదగారి రేగొండకు భార్య మంజులతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు. తమకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగానే భార్యాభర్తలు వ్యవసాయ పొలానికి వెళ్లారు. మంజుల పొలంలో పనిచేస్తుండగా, రేగొండ సమీపంలోని చింతచెట్టుకింద పడుకున్నాడు. మంజుల కొద్దిసేపటి తర్వాత రేగొండ వద్దకు వెళ్లి చూడగా పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించింది. అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీ సేవల్ని వినియోగించుకోవాలి

మాజీ సర్పంచ్ స్వరూప

చిలప్‌చెడ్(నర్సాపూర్‌): ఆర్టీసీ బస్ సేవల్ని గ్రామ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ స్వరూప సూచించారు. నర్సాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్ చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామానికి రాగా, గ్రామస్తులు దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ...గతంలో గ్రామానికి బస్ సౌకర్యం ఉండేదని కొద్దికాలంగా గౌతాపూర్‌తోపాటు, పలు గ్రామాలకు ఆర్టీసీ రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయన్నారు. దీనిపై ఆర్టీసీ సేవల్ని పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను, పలుమార్లు కోరడంతో తిరిగి గ్రామానికి బస్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు విఠల్, భీమయ్య, రమేశ్‌నాయక్, యాసిన్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజారెడ్డి వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 మొబైల్స్, రూ. 8,765 నగదు ను స్వాధీనం చేసుకుని మెదక్ టౌన్ ఎస్‌ఐకి అప్పగించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దాడి చేసినట్లు తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్‌: పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రంగాకృష్ణ వివరాల ప్రకారం... అల్లాపూర్ సమీపంలో ఓ వెంచర్‌లో పేకాటాడుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10700, మూడు బైకులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214 [H-783418]

WANTED

FACULTY TEACHERS

■ GEETHA SCHOOL - Toopran Wanted a well - qualified and experienced LADY PRINCIPAL. Contact No: In charge Principal: T. Premraj - 9491756073, Vice Principal: V. Rajeshwar - 94939 35003. Send your resumes to geethahstoopran@gmail.com [SCA25005509]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రణాళిక.. ప్రహసనం

కానరాని కార్యాచరణ - ఎక్కడి చెత్త అక్కడే

- మున్సిపాలిటీల్లో తాండవం చేస్తున్న సమస్యలు
- విఫలమైన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పురపాలికల్లో వందరోజుల ప్రణాళిక సరిగా అమలవ్వడం లేదు. వెరసి మురుగునీటి కాలువల అపరిశుభ్రత, చెత్త తరలింపులో నిర్లక్ష్యం, మురుగు గుంతలు, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు, తదితర పనులు చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు పకడ్బందీ ప్రణాళికతో మున్సిపాలిటీల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జోగిపేట(అందోల్‌): పట్టణంలోని భరత్ నగర్ కాలనీకి వెళ్లే దారిలో గల పార్కు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ పార్కు మున్సిపల్ కార్యాలయం ప్రక్కనే ఉండటం గమనార్హం. గాంధీ పార్కుకు తాళం వేయడం వల్ల అందులో చెత్త పేరుకుపోయింది. జోగిపేట-అన్నాసాగర్ వెళ్లే రహదారి ప్రక్కనే చెత్త పేరుకుపోయింది. వంద రోజుల ప్రణాళిక తూతూ మంత్రంగా నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. 20 వార్డులను టార్గెట్ చేసి పనులు చేపట్టినా పారిశుధ్యం, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు.


జోగిపేట(అందోల్‌): రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ప్రణాళిక అమలేది?


మురుగుతో నిండి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక ముందుకు సాగడం లేదు. అక్కడక్కడ మొక్కుబడి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనంతరం వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పట్టణంలోని చెరువులు, ఎంఎస్ కెనాల్ పారిశుద్ధ్య లోపంతో కంపుకొడుతున్నాయి. మల్లం చెరువు కట్టపై చెత్త పేరుకుపోయింది. ఎంఎస్ కెనాల్‌లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయి కంపు కొడుతోంది. కాలనీల్లోని మురుగు కాల్వలు సైతం ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అవగాహన కల్పిస్తే.. ఇలా చేస్తారా?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నామమాత్రంగా ప్రణాళిక నిర్వహిస్తున్నారు. మొత్తం యాక్షన్‌ప్లాన్‌లో 50 అంశాల్లో పారిశుద్ధ్యం ఒకటి. తడి, పొడి చెత్తపై మాత్రం అవగాహన కూడా కల్పించడం లేదు. పలుచోట్ల చెత్తను బహిరంగంగా తగలబెడుతున్నారు. పారిశుద్ధ్యంపై కాలనీలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ మున్సిపల్ పరిధిలో అమలు కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు పక్కన తగులబెడుతున్న చెత్త


దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీ వద్ద అధ్వానంగా చెత్తకుప్పలు


దుబ్బాకలో టీటీడీ కల్యాణమండపం సమీపంలో దర్శనమిస్తున్న చెత్త

పారిశుధ్య పనుల్లో నిర్వహణ లోపం..

దుబ్బాక: మున్సిపాలిటీలోని 20 వార్డులలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం డ్రైనేజీ శుభ్రం చేసే పనులు కూడా సరిగా చేయడం లేదు. వార్డులలో ప్రజలకు తడి,పొడి చెత్త, వానాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ.20 కోట్ల నిధులు వస్తే సమస్యలు తీరుతాయని, అవి లేకే సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ఉన్న సమస్యలు అధికారులు నోటీఫై చేసుకుంటున్నప్పటికీ అవి ఎంత వరకు పరిష్కారం అవుతాయో.. చూడాలని ప్రజలు వాపోతున్నారు.

వృద్ధి చెందుతున్న దోమలు


పిల్లల పార్కులోని భగీరథ ట్యాంకు వద్ద వాల్వుల చుట్టూ నిలిచిన మురుగు

నర్సాపూర్: మున్సిపాలిటీలో మురికి కాలువల శుభ్రం, పిచ్చి మొక్కలు తొలగింపు, భగీరథ పథకం నీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయడం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ఆ పనులను సక్రమంగా చేపట్టక పోవడం గమనార్హం. పిల్లల పార్కులోని మిషన్ భగీరథ ట్యాంకు నీరు లీకవుతుంది. వాల్వుల వద్ద మురికి కూపంగా తయారైంది. సునీతారెడ్డి కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురికి నీరు నేలపై పారి పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు పెరగుతున్నాయని కాలనీ వాసులు చెప్పారు

సమ్మె నోటీస్ అందజేత

కొల్చారం(నర్సాపూర్‌): జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ, ఉద్యోగ కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు మల్లేశం గురువారం పేర్కొన్నారు. ఎందుకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయ అధికారి రాజేశ్‌కు సమ్మెనోటీస్ అందజేశారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఈ సమ్మెలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని మల్లేశం ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

వృత్తిలో బదిలీలు సహజం

మనోహరాబాద్(తూప్రాన్‌): ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింగం పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు ఎస్ఏగా విధులు నిర్వహించిన పురుషోత్తంరావు బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లారు. దీంతో కాళ్లకల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరీశ్‌ను విమర్శించే స్థాయి లేదు

ఆవుల రాజిరెడ్డిపై బీఆర్ఎస్ ధ్వజం

కౌడిపల్లి(నర్సాపూర్‌): మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే స్థాయి ఆవుల రాజిరెడ్డికి లేదని మండల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కౌడిపల్లి మండలం ధర్మాసాగర్‌వద్ద గురువారం మాజీ జెడ్పీటీసీ, మండల బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్‌తో కలసి వారు విలేకరులతో మాట్లాడారు. హరీశ్‌రావును ఏ పదవీలేని ఆవుల రాజిరెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏ హోదాతో సీసీరోడ్డు ఇతర పనులు భూమిపూజ చేస్తున్నావని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని దుస్థితిలో ఉందన్నారు. డీజిల్ పోయలేం అని పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ తాళాలు అప్పగించినా ప్రభుత్వానికి చలనం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, కాంతరావ్, శ్యాంసుందర్‌రావ్, ప్రవీణ్ కుమార్, శివయ్య, మనోహర్‌రెడ్డి, నర్సింలు, దూద్యనాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

చేపల కోసం వెళ్లి.. స్తంభాన్ని ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి


సార్ల రాంచరణ్

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సార్ల రామ్‌చరణ్(16) అదే గ్రామంలో 10 వతరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఆంజనేయులుతో కలిసి కొమురవెల్లి చెరువులో చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. చెరువులో చేపలు పడకపోవడంతో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కొమురవెల్లి నుంచి తిమ్మారెడ్డిపల్లి వెళ్లే రోడ్డులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


వినోద్ కుమార్

కంది(సంగారెడ్డి): వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం... కందికి చెందిన కోస్కే వినోద్ కుమార్ గౌడ్(22) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి కందిలో దాబాకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పటాన్ చెరు వైపు నుంచి సంగారెడ్డికి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు..


మూసారహు సాదే

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నేపాల్‌కు చెందిన మూసారహు సాదే (55) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం వచ్చి పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వాష్ రూమ్‌కి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు కిందపడి తలకి గాయమైంది. తోటి కార్మికులకు చెప్పగా ఇస్నాపూర్‌లో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మంగోల్‌లో గుర్తు తెలియని మృతదేహం

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం మండలంలోని మంగోల్ గ్రామంలో కనిపించింది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గ్రామంలో 15 రోజులుగా గుర్తు తెలియని వృద్ధుడు భిక్షాటన చేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి బస్టాప్ వద్ద పడుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

- కుమారులు సరిగా చూడటం లేదనా..
- అనారోగ్య సమస్యతో ఆత్మహత్యనా?


పూదరి కనకవ్వ

అక్కన్నపేట(హుస్నాబాద్): చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన గురువారం సాయంత్రం మండలంలోని అంతక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పూదరి కనకవ్వ(70)కు నలుగురు కుమారులు ఉన్నారు. అందులో ఒక కుమారుడు కరీంనగర్‌లో ఉంటున్నాడు. మిగిలిన కుమారుల వద్ద ఆమె ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కుమారులు సరిగా పట్టించుకోకపోవడంతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. అనార్యోగ సమస్య తట్టుకోలేకనా? లేక కుమారులు సరిగా చూడటం లేదని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు. వృద్ధురాలి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై సాక్షి ఎస్ఐ విజయ్‌భాస్కర్‌ను సంప్రందించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తునికిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎతిరాజుల సుశీలకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా చిన్న కొడుకు యాదగిరి(32) తునికిలో తల్లి వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. తల్లి కూలీపనులు చేస్తూ పోషిస్తుంది. పలుమార్లు మద్యం సేవించి తల్లితో సైతం గొడవపడేవాడు. గురువారం తల్లి గ్రామంలోకి వెళ్లొచ్చేసరికి ఇంట్లో యాదగిరి ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య పదేళ్లక్రితం చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు కూలగొట్టి రోడ్డున పడేశారు

- పెట్రోలు డబ్బాతో దివ్యాంగుడి ఆందోళన
- డబుల్ బెడ్రూం నుంచి వెళ్లిపోవాలని లబ్ధిదారుల ఒత్తిడి


అంబేద్కర్ చౌరస్తా వద్ద పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగిన దివ్యాంగుడు నాగరాజు

గజ్వేల్‌రూరల్: రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించిన గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోకుండా తాత్కాలికంగా డబుల్ బెడ్రూంలను కేటాయించి చేతులు దులుపుకున్నదని బాధితులు పేర్కొన్నారు. పెట్రోల్ డబ్బా పట్టుకొని ఆత్మహత్యే శరణ్యమంటూ ఓ దివ్యాంగుడు ఆందోళనకు దిగాడు. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో రోడ్డు వెడల్పులో భాగంగా గత ప్రభుత్వ పాలనలో 19 మందికి చెందిన ఇళ్లను తొలగించేందుకు అధికారులు సిద్ధమవగా, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బాధితులకు నచ్చజెప్పి సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలలోకి పంపించారు. అక్కడ మొదటి అంతస్తులో ఇళ్లు కేటాయించారు. కానీ, దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 9 మంది బాధితులకు ఉండేందుకు అనుమతించారు. కాగా డబుల్ లబ్ధిదారులు వచ్చి ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాధిత దివ్యాంగుడు నాగరాజు పెట్రోల్ డబ్బా, అగ్గిపెట్టెను చేతిలో పట్టుకొని ఆందోళనకు దిగాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సైదా ఘటనా స్థలానికి వెళ్లి నచ్చజెప్పారు. బాధితులందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగరాజు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించారని, ప్రస్తుత ప్రభుత్వం ఆదుకొని గూడు కల్పించాలని కోరాడు.

లోన్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు

సైబర్ నేరస్తుడి అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): లోన్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ పి.నీరేష్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుగొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అందులో చేరేలాగా చేసిన శ్రీకాంత్ జాతీయ రియల్ ఎస్టేట్ సంఘం నుంచి రుణాలు వస్తాయని, అందుకు సభ్యత్వ రుసుము రూ. 25 వేలు చెల్లించాలని గ్రూపులో పోస్ట్ చేశాడు. ఇది నిజమేనని నమ్మిన మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు లోన్ కావాలని వాట్సాప్‌లో అడిగాడు. వెంటనే అతనికి ఫోన్ చేసి సభ్యత్వ రుసుము రూ.25వేలు పంపించాలని శ్రీకాంత్ కోరాడు. సదరు వ్యక్తి గూగుల్‌పే ద్వారా రూ.25 వేలు రెండు విడతల్లో పంపించాడు. ఫోన్‌చేస్తే ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నేరస్తుడిని అరెస్టు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నీరేష్

చేయూత.. ఉపాధి

మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ.83 కోట్ల రుణాలు

- డిజిటల్ పద్ధతిలో నెలవారీగా చెల్లింపులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్న అతివలు

సంగారెడ్డి టౌన్: మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు ప్రవేశపెడుతున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు వివిధ ఉపాధి అవకాశాలు లభించేలా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. మహిళలకు కిరాణా దుకాణాలు, టెంట్ హౌస్, కోళ్ల పరిశ్రమ, డెయిరీ పామ్, వివిధ చిన్న తరహా వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని మహిళా సంఘాల ద్వారా లబ్ధి పొందుతూ జీవనోపాధి పొందుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో స్త్రీనిధి ద్వారా ఈ సంవత్సరంలో రూ.83 కోట్ల రుణాలు మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. జిల్లాలో 25 మండలాలు, 365 గ్రామ సంఘాల్లో 10,016 మంది సభ్యులకు స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణాలిచ్చారు. స్త్రీ నిధి నుంచి రుణాలు పొంది స్వయం ఉపాధి పొందడంతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలకు ప్రతి నెల ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించడంతోపాటు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు.


డిజిటల్ పద్ధతిలో డబ్బులను చెల్లించిన మహిళా సంఘం సభ్యులు

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘంలోని సభ్యులకు స్త్రీ నిధి ద్వారా రుణాలిస్తూ వ్యాపారాలు చేయడానికి ప్రోత్సహిస్తున్నాం. తీసుకున్న డబ్బులను ప్రతి నెల ఆన్‌లైన్‌లో సకాలంలో చెల్లిస్తున్నారు. మహిళలకు మరింత అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. వంద శాతం రుణాలు అందజేశాం.

- శ్రీనాథ్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్

ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్న



స్త్రీ నిధి ద్వారా మూడు లక్షల రుణం తీసుకున్న. ఆ డబ్బుతో ఫ్యాన్సీ స్టోర్ దుకాణం ఏర్పాటు చేసిన. తీసుకున్న రుణాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాను. అలాగే పొదుపులో కూడా ప్రతి నెలా డబ్బులు కడుతున్నాం. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీనిధి ఉపయోగపడుతుంది.

- సరస్వతి, తాలేల్మా గ్రామం, అందోల్

శుభకార్యాలకు డెకరేషన్



స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్న. ఈ డబ్బులతో వివాహాలకు సంబంధించిన డెకరేషన్ వస్తువులను కొనుగోలు చేశా. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నా. శుభకార్యాలకు డెకరేషన్ నిర్వహిస్తూ మంచి ఆదాయం పొందుతున్న.

- పద్మ, దేవుని గ్రామం, వట్టిపల్లి

మంచి అవకాశాలు



మహిళా సంఘాల్లోని సభ్యులకు మంచి అవకాశాలు ఉన్నాయి. స్త్రీ నిధి ద్వారా మూడు లక్షలు రుణం తీసుకొని సొంతంగా టెంట్ హౌస్‌ను నడుపుతున్న. గ్రామంలోనే ఉంటూ వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు సామాన్లు ఇస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తున్నాను.

- లక్ష్మి, ఇస్మాయిల్ ఖాన్‌పేట్, సంగారెడ్డి